క్లుప్తంగా

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత



విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో పూర్వ విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 1984–87 డిగ్రీ బ్యాచ్ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి రూ. 95వేలు విరాళం అందించారన్నారు. ఈ మొత్తాన్ని కళాశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంక్షేమానికి వెచ్చిస్తామని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు కళాశాలకు ఎంతో సహకారం అందించారని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, నాగేశ్వరరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, పుల్లయ్య, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు రాంమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సలావుద్దీన్, సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లస్వామి(37) అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఏపీఓ విజయరాణి, పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్, ఈసీ నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది ఎల్లస్వామి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

డ్రైవర్‌పై కేసు నమోదు



పోలీసులకు పట్టుబడ్డ వాహనం

కోవెలకుంట్ల: పరిమితికి మించి కూలీలను వాహనంలో ఎక్కించుకుని వెళుతున్న డ్రైవర్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. దొర్నిపాడు మండలం చాకరాజువేముకు చెందిన శేఖర్ ఎక్కువ మంది కూలీలను బొలెరో వాహనం లోపల, క్యాబిన్‌పై ఎక్కించుకుని బనగానపల్లె వైపు వెళుతూ స్థానిక చౌరస్తాలో పట్టుబడ్డాడన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

డోన్ టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.20 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ లబ్ధిదారులకు అందజేశారు.

యాచకురాలి మృతదేహం అప్పగింత

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో మృతి చెందిన యాచకురాలి మృతదేహాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ముద్దాస్ పుల్లమ్మ(60) కొన్ని నెలల నుంచి స్థానిక పాండురంగస్వామి దేవాలయ సమీపంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రాత్రి సమయాల్లో గుడి పరిసర ప్రాంతాల్లో నిద్రించేది. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక శుక్రవారం మృత్యువాత పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వివరాలు ఆరా తీయగా మృతురాలిది ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం రెడ్డిపల్లెగా గుర్తించారు. మృతురాలి కుమారుడికి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు కోవెలకుంట్లకు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: జగదుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నందున వెల్దుర్తి 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇస్తామని ఏఈ వెల్లడించారు.

- **బేతంచెర్ల:** పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి సత్రం వరకు విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూదన్ రెడ్డి, ఏఈ పుల్లయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ఫ్యాక్టరీ యజమానులు సహకరించాలని కోరారు.

దాహం.. దాహం

- పనిచేయని మంచినీటి పథకాలు
- తప్పని తాగునీటి ఇక్కట్లు
- గుక్కెడు మంచినీటి కోసం పాట్లు

కోవెలకుంట్ల: వేసవికాలం కావడం, ఓ వైపు మండుటెండలు, మరోవైపు తాగునీటి పథకాలు పనిచేయకపోవడంతో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. కోవెలకుంట్ల పట్టణ శివారులోని రెండు కాలనీల వాసులు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కోవెలకుంట్ల– నంద్యాల ఆర్ అండ్‌బీ రహదారి పక్కన ఉన్న ఇందిరమ్మ కాలనీలో దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీవాసులకు మంచినీరు అందించేందుకు గ్రామ పంచాయతీ అధికారులు మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. పట్టణ శివారులోని కుందూనది ఒడ్డున ఉన్న ఎస్ఎస్ ట్యాంకు నుంచి పైప్‌లైన్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చేసి సరఫరా చేసే నీటిని అవసరాల నిమిత్తం వాడుకుంటూ మినరల్‌వాటర్‌ప్లాంట్ ద్వారా తాగునీటిని తెచ్చుకుని దాహార్తి తీర్చుకునేవారు. ఏడాది క్రితం నుంచి ప్లాంట్ పనిచేయక మూతపడింది. తాగునీటికి ప్రత్యామ్నాయం కల్పించకపోవడంతో కాలనీ వాసులు గుక్కెడు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కాలనీలో ఎక్కువ శాతం వ్యవసాయ, ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబాలు అధికంగా ఉన్నాయి. వేసవికాలం కావడంతో ఉదయాన్నే పనులకు వెళుతున్నారు. తాగేందుకు నీరు లేకపోవడంతో దాదాపు కిలోమీటర్ దూరంలో ఉన్న స్వామినగర్ కాలనీ లేదా పట్టణంలోని వివిధ మినరల్ వాటర్‌ప్లాంట్ల వద్దకు వెళ్లి తాగునీటిని తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నడుకుంటూ, సైకిళ్లు, బైక్‌లపై వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అంతదూరం వెళ్లలేని వృద్ధులు, మహిళలు కొళాయిల ద్వారా వచ్చే నీటిని తాగుతూ దాహార్తి తీర్చుకుంటున్నారు.



ఇందిరమ్మ కాలనీలో మూతపడ్డ మినరల్ వాటర్‌ప్లాంట్

జగనన్న కాలనీలో తాగునీటి కష్టాలు

పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీకి ఎదురుగా 2020లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 250 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కాగృహాలు మంజూరు చేసింది. కాలనీలో 150 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా 60 కుటుంబాలకు పైగా కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీవాసులకు తాగునీటి కోసం చేతిపంపులు ఏర్పాటు చేశారు. ఆరు నెలల నుంచి చేతిపంపులు పనిచేయకపోవడంతో కాలనీవాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. తాగేందుకు నీరు లేకపోవడంతో కోవెలకుంట్ల పట్టణంలోకి వచ్చి తెచ్చుకోవాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. మరికొందరు క్యాను రూ. 20 చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. వేసవికాలం కావడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రెండు కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎస్సార్‌బీసీ కాలనీలో నిరుపయోగంగా చేతిపంపు

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- గంటకే ముగించిన అధికారులు
- వేతన బకాయిలపై ఎంపీటీసీల అసంతృప్తి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రతి మూడు నెలలకోసారి మండల సర్వసభ్య సమావేశాలను నిర్వహిస్తారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం గంట సేపటికే ముగిసింది. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వరుసగా చకచక చదివి వినిపించారు. వాటిపై పెద్దగా చర్చ జరగకపోవడంతో సమావేశాన్ని త్వరగా ముగించి మమ అనిపించారు. సభలో ఇద్దరు ముగ్గురు సభ్యులు మాత్రమే సమస్యలు ప్రస్తావించారు. దాదాపు 20 నెలల నుంచి తమకు గౌరవ వేతనాలు మంజూరు కావడం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. కేవలం సమావేశాలకు మాత్రమే పనికొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్‌కు సంబంధించి మండలాన్ని అత్యంత కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించింది. మైనింగ్ గ్రామాలు కూడా జాబితాలో ఉన్నాయా లేవా అని మీర్జాపురం సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి ప్రస్తావించారు. మైనింగ్ గ్రామాలతో సంబంధం లేకుండా క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతుల జాబితా పంపామని ఏఈ జ్యోతి వివరించారు. మీర్జాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రెండు బోర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న సర్పంచ్ మహేశ్వరరెడ్డి

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ధ్వజం

- మున్సిపల్ సమావేశంలో వివిధ సమస్యలపై నిలదీత

డోన్: మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, అధికారుల తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు విద్యుత్, పారిశుద్ధ్య పనులపై అధికారుల నిర్లక్ష్య వైఖరి గురించి నిలదీశారు. డిపాజిట్ చెల్లించినా విద్యుత్ అధికారులు ఏళ్లుగా ఆయా కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడం లేదని కౌన్సిలర్ సుంకయ్య ఆరోపించారు. నిధుల కొరత పేరుతో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచకపోవడం మూలంగా పట్టణంలో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని, కొద్ది నెలలుగా కార్మికులకు పరికరాలు అందకపోవడంతో అనారోగ్యం బారిన పడి మృతిచెందుతున్నారని కౌన్సిలర్లు సుంకయ్య, మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఆర్జ్ రమణ, మిట్టా ఉమామహేశ్వరి అన్నారు. కాంపాక్టర్లు, ట్రాక్టర్లు, మినీ ఆటోలన్నీ మూలన పడడం వల్ల పారిశుద్ధ్య పనులు అధ్వానంగా మారాయని కౌన్సిలర్లు టమటం లక్ష్మి, సుకన్య, మేకల విమల, సుమలతలు అసహనం వ్యక్తం చేశారు. లక్ష జనాభా ఉన్న పట్టణంలో కేవలం నలుగురు మేస్త్రీలు, పదుల సంఖ్యలో కార్మికులతో పారిశుద్ధ్య పనులు ఎలా కొనసాగిస్తారని కమిషనర్‌ను నిలదీశారు. మరో పది రోజుల్లో వాహనాలకు మరమ్మతులు చేయించడంతో పాటు కారుణ్య నియామకాలు చేపట్టి పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తామని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ హామీనిచ్చారు. ఆధునిక కూరగాయల మార్కెట్‌కు డ్రైనేజీని ఏర్పాటు చేయకపోవడం వల్ల వర్షం నీటితో పాటు చుట్టుపక్కల డ్రైనేజీ నీరు అక్కడ చేరి అసౌకర్యంగా మారిందని కౌన్సిలర్లు కురుకుంద పద్మావతి, సుబ్బలక్ష్మి అన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫి, కుమ్మరి రాజు, మున్సిపల్ ఆర్ఐ వెంకటరెడ్డి, డీఈ, ఏఈ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించాలి

బనగానపల్లె రూరల్: రైతులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీడీఓ వెంకటరమణ అధ్యక్షతన జాతీయ ఉపాధి హామీ పథకం, హార్టికల్చర్‌శాఖ అధికారులతో పండ్ల తోటల సాగు ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులకు సాధారణ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై గ్రామ స్థాయిలో ఎన్ఆర్‌జీఎస్ టీఏలు, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారి రఘువరన్ మాట్లాడుతూ.. మండలానికి ఈ ఏడాది 200 ఎకరాల ఉద్యానవన పంటల సాగు చేయాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చిందని తెలిపారు. రైతులకు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తామన్నారు. ఐదు ఎకరాల్లోపు రైతులందరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. చీని, మామిడి, జామ, సపోట, డ్రాగన్‌ఫ్రూట్స్, మునగ మొత్తం 17 రకాల మొక్కలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. ఈసీ రాజాబాబు, ప్లాంటేషన్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి

పాలిసెట్‌కు 4 సెంటర్లు ఏర్పాటు

బేతంచెర్ల: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 30వ తేదీ జరిగే పాలిసెట్‌కు పట్టణంలో 4 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 232, సుమేధా హైస్కూల్‌లో 218, రీడ్ జూనియర్ కళాశాలలో 227, సెంట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో 232 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

29న బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో తలనీలాల సేకరణ, చెప్పుల స్టాండ్ నిర్వహణ హక్కుల కోసం ఈ నెల 29వ తేదీ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.25వేల డిపాజిట్ చెల్లించి, సాయంత్రం 3 గంటలకు ఆలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో వివరాల నమోదుకు వినతి

ప్యాపిలి: తన పొలానికి సంబంధించిన వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని పోతుదొడ్డి గ్రామానికి చెందిన రైతు లక్ష్మిరెడ్డి శుక్రవారం తహసీల్దార్ భారతిని కోరారు. సర్వే నంబర్ 82–1ఏ1లో తన పేరుపై 3.2 ఎకరాల పొలం ఉందన్నారు. సదరు భూమిని ఇతరులకు విక్రయించి రిజిస్టర్ చేసి ఇవ్వడానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపాడు. అయితే భూమికి సంబంధించిన వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదని చెప్పారని.. భూమిని రిజిస్టర్ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. విచారణ చేసి తన భూమి వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని కోరాడు.

నేడు సర్వసభ్య సమావేశం

సంజామల: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పోచ రమాదేవి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి





బనగానపల్లె: కోర్టు ఆవరణలో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు, డోన్‌లో ఉపాధ్యాయుల కొవ్వొత్తుల ర్యాలీ

బనగానపల్లె రూరల్: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన మృతులకు బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడి భారత సార్వభౌమత్వం, సమగ్రతపై దాడిగా అభివర్ణించారు. ఉగ్రవాదులు అమాయక పౌరులను పొట్టన పెట్టుకోవడం హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఖాజాహుస్సేన్, కార్యదర్శి శ్రీనివాసమూర్తి, జాయింట్ కార్యదర్శి అల్లావుద్దీన్, ట్రెజరర్ విజయబాస్కర్, లైబ్రరి సెక్రటరీ ముజాహీర్, న్యాయవాదులు అబ్దుల్‌ఖైర్, యూసఫ్, నరసింహారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఆజాంహుస్సేన్ పాల్గొన్నారు.

హేయమైన చర్య

డోన్ టౌన్: పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని యూటీఎఫ్ నాయకులు అన్నారు. దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాణిక్యంశెట్టి, జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, లక్ష్మీనాయక్, సుభాన్, రామ్మూర్తి, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వేడుకగా తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, వేదపండితుడు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు.

బీఈడీ పరీక్షల తనిఖీ

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న బీఈడీ పరీక్షలను రాయలసీమ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ భారతి ఉన్నారు. కాగా ఈ నెల 22 తేదీ ప్రారంభమైన బీఈడీ పరీక్షలు ఈనెల 28వ తేదీ వరకు జరగనున్నాయి.

పథకాల అమలుకు పోరాటం

కోవెలకుంట్ల: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని.. రానున్న కాలంలో పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. కోవెలకుంట్ల శ్రీరాంనగర్‌లో శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక నిధులు తగ్గించడం, పేదల కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. సీపీఎం నాయకులు సుధాకర్, బుజ్జి, రాములమ్మ, నరసింహుడు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

డోన్ టౌన్: శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి, నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని.. ఇందుకు పుస్తక పఠనం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అన్నారు. శుక్రవారం కొత్తపేట ఉన్నత పాఠశాలలో పుస్తకాల ప్రదర్శన, కరపత్రాలను విడుదల చేశారు. డోన్ డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి, యూటీఎఫ్ నేత వెంకటసుబ్బారెడ్డి, నరసింహులు మాట్లాడుతూ.. పుస్తకాలు పిలుస్తున్నాయి కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను వేడుకగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఊరేగించారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం





బేతంచెర్ల: మలేరియాపై కోటపేటలో అవగాహన ర్యాలీ, కోవెలకుంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోటపేట కాలనీలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యురాలు ప్రియాంక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నగర పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా రావడానికి గల కారణాలు, నిర్మూలన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మలేరియాను నివారిద్దాం

డోన్ రూరల్: అందరం కలిసి కట్టుగా ఉండి మలేరియాను నివారిద్దామని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. కొత్తబురుజు ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. ఇంటి ముందు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

ప్రాణాంతక వ్యాధులతో జాగ్రత్త

కోవెలకుంట్ల: దోమలు కుట్టడం వల్ల సోకే ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు సుజాత, రాబర్ట్ కెన్నడి సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ‘దోమ పుట్టరాదు.. దోమ కుట్టరాదు’ అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. దోమలు ప్రబలడం వల్ల డెంగీ, మెదడువాపు వ్యాధి, చికున్‌గున్యా, మలేరియా, తదితర విష జ్వరాలు సోకే అస్కారం ఉందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఎవరి పరిధిలో వారు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

జీవాల దొంగలు అరెస్టు

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైప గ్రామంలో ఈ నెల 13,14వ తేదీల్లో జరిగిన ఏడు జీవాల చోరీ కేసులో పాణ్యం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన దేవరకొండ సురేష్, కోనేటి సాయి వెంకట్, అచ్చుకట్ల అక్బర్‌వలీ, బి.నాగరాజు జీవాలను ఆటోలో తరలిస్తుండగా నందవరం గ్రామ సమీపంలోని సదానంద ఆశ్రమం వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.



ఉపాధ్యాయులతో స్కూల్ పూర్వవిద్యార్థులు




యర్రగుడిలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల, యర్రగుడి ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం 2004–05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒక్క చోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో గురువులు నేర్పిన విద్య, క్రమశిక్షణ వల్లే తాము ఈస్థాయిలో ఉన్నామని తెలిపారు. తమకు పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులతో కలిసి సందడిగా గడిపారు. రూ.70 వేలు వెచ్చించి పాఠశాలలో స్టేజీ వద్ద రేకుల షెడ్డు నిర్మించారు. తాము చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలని ఉద్దేశంతో విద్యార్థుల సౌకర్యం కోసం షెడ్డు ఏర్పాటు చేయించామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

ఎస్సీ శ్మశాన వాటికలో పనుల అడ్డగింత

కొలిమిగుండ్ల: యర్రగుడిలోని ఎస్సీల శ్మశాన వాటికలో చేస్తున్న పనులను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇక్కడ 50 ఎస్సీ కుటుంబాలున్నాయి. 30 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూమిలో మృతి చెందిన వారిని ఖననం చేస్తున్నారు. ఇటీవల శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కలిసి విన్నవించారు. రెవెన్యూ సిబ్బంది స్థలంలో కంపచెట్లు లేకుండా శుభ్రం చేసుకుంటే వచ్చి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో జేసీబీ సాయంతో కంపచెట్లు తొలగించే పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కొంత మంది గ్రామస్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఉద్దేశ పూర్వకంగా శ్మశాన వాటిక ప్రదేశంలో కొద్ది రోజుల క్రితం ఉపాధి హామీ నిధులతో నీటి తొట్టె నిర్మాణ పనులు ప్రారంభించారని కాలనీవాసులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలం కావడంతో ఎప్పటి నుంచో ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఎకరాకు పైగానే ఉన్న స్థలంలో మాల,మాదిగలకు 20 సెంట్ల చొప్పున శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని అధికారులను కోరడంతో పనులు చేసేందుకు ముందు కొచ్చామన్నారు. కానీ కొంత మంది గ్రామస్తులు పథకం ప్రకారం అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పనులు అడ్డుకోవడంతో గ్రామస్తులు, ఎస్సీల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి.



పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రజా రవాణా సమస్యలపై శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

- **డోన్ టౌన్:** ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9959225795 నంబర్‌కు కాల్ చేసి తెలయజేయవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

బేతంచెర్ల: ప్రభుత్వ స్థలంలో 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు ఇళ్లు నిర్మించుకుని ఇంత వరకు క్రమబద్ధీకరించుకోని వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 30 ప్రకారం బీపీఎల్ కుటుంబాలకు 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. 150 నుంచి 451 చదరపు గజాల వరకు నిర్దేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.